సాక్షి
అనకాపల్లి
మంగళవారం। 13। ఆగస్టు। 2024



వైభవంగా శ్రావణ పూజలు

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కనక మహాలక్ష్మి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అప్పన్న దర్శనాలు కుదింపు

సింహాచలం: పాదాలమ్మ, బంగారమ్మ పండగ సందర్భంగా సింహాచలేశుని దర్శనాలు ఈరోజు మధ్యాహ్నం 2.30 గంటల వరకే లభిస్తాయి.



వైద్య విద్యార్థుల నిరసన

విశాఖ: కోల్‌కతాలో పీజీ ట్రైనీ డాక్టర్‌పై జరిగిన ఘాతుకానికి నిరసనగా సోమవారం ఏఎంసీ వైద్య విద్యార్థులు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు.

న్యూస్‌రీల్

పర్యాటకులను ఆకర్షించేలా సౌకర్యాలు

- వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్



తెన్నేటి పార్కులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: పర్యాటకులను ఆకర్షించేలా వీఎంఆర్‌డీఏ పార్కులు, పరిసర ప్రాంతాలను తీర్చిదిద్దాలని, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన తెన్నేటిపార్క్‌లో బిగ్ స్క్రీన్ స్టేజ్ పరిసరాలను పరిశీలించారు. చక్కటి కళాకృతులతో తీర్చిదిద్ది సందర్శకులను ఆకర్షించే విధంగా పచ్చదనంతో నింపాలని చెప్పారు. ఎక్కడికక్కడ డస్ట్ బిన్లు ఏర్పాటు చేసి చెత్త తరలించాలన్నారు. నడకదారులు, గోడలకు అతికించిన పాడైన టైల్స్‌ను తక్షణమే మార్చాలని, గోడలకు చక్కని థీమ్ పెయింటింగ్స్ వేయించాలని సూచించారు. పాడైన గార్డెనింగ్ విద్యుత్ దీపాలు, బెంచీలను మార్చి సందర్శకులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. హ్యాండ్ రైలింగ్‌కు జరుగుతున్న మరమ్మతులను పరిశీలించారు. అనంతరం బీచ్ రోడ్‌లోని సీ హారియర్ మ్యూజియాన్ని సందర్శించి అక్కడ ఉన్న ఆర్టిఫ్యాక్ట్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ స్తంభాలకు ఉన్న తుప్పును తొలగించి పెయింటింగ్ చేయించాలని, సందర్శకులకు తాగునీరు, మెరుగైన పారిశుధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

అందుబాటులో కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు

బుచ్చెయ్యపేట: పశువులు ఆడ పెయ్యిలకు జన్మనిచ్చే కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బెహరా ప్రసాదరావు తెలిపారు. జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పెదమదీనలో రాష్ట్రీయ గోకుల మిషన్ నిధులతో ఉచిత గర్భకోశ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 59 పశువులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పెయ్యిలు మాత్రమే జన్మించే లింగ నిర్ధారణ ఇంజక్షన్లు ప్రతి మండలంలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికార్లు సౌజన్య, శివకుమార్, వై ఉమామహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

నాకూ కావాలి మేయర్ పీఠం



నెలకు ఎమ్మెల్యేకు రూ.5 లక్షలు.. కార్పొరేటర్‌కు రూ.లక్ష

కూటమి నేతలకు జనసేన కార్పొరేటర్ బంపర్ ఆఫర్

'నీకు రూ.15 వేలు... నీకు రూ.15 వేలు.... నీకు 18 వేలు' అంటూ ఎన్నికల ముందు టీడీపీ నేత చెప్పిన హామీలు ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. మరి దీనినే స్ఫూర్తిగా తీసుకున్నాడో ఏమో విశాఖ నగర మేయర్ పీఠం తనకిస్తే.. నీకు రూ.5 లక్షలు... నీకు రూ.5 లక్షలు... నీకు రూ.లక్ష అంటూ సదరు కార్పొరేటర్ కాస్తా ఏకంగా ఎమ్మెల్యేలకు, సహచర కార్పొరేటర్లకు బంపర్ ఆఫర్ ఇచ్చాడు.

'నేనేంటో మీకు తెలుసు.. నా పవర్ ఏంటో మీరు ఇప్పటికే గ్రహించి ఉంటారు. అందుకే కూటమి తరఫున మేయర్ పీఠం నాకు ఇవ్వండి. మీకు ఎలాంటి లోటు రాకుండా నేను చూసుకుంటాను' అని భరోసా ఇచ్చాడు. ఎమ్మెల్యేలూ.. మీకు రూ.5 లక్షలు.. సహచర కార్పొరేటర్లూ మీకు రూ.లక్ష.. ఇదిగిదిగో ఈ మధ్యే కూటమితో జతకట్టిన ఈ కార్పొరేటర్‌కూ లక్ష రూపాయలు చొప్పున నెలకు ఇస్తాననడం ఇదే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

- మేయర్ పదవి ఇప్పిస్తే అన్నీ చూసుకుంటానని జనసేన కార్పొరేటర్ హామీ
- ఎమ్మెల్యేలకు, కూటమి కార్పొరేటర్లకు నెలవారీ మామూళ్లు ఇస్తానంటూ ఆఫర్
- సూపర్ ఆఫర్‌తో ఆలోచనలో పడ్డ కూటమి వర్గం
- ఆ కార్పొరేటర్ డేంజర్ అంటూ తిరస్కరించిన మరికొందరు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

మహా విశాఖ నగర పాలక సంస్థకు 2021లో జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించిన వైఎస్సార్ సీపీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. అయితే ఇటీవల జరిగిన పరిణామాలతో ఆ పార్టీ బలం కాస్తా తగ్గింది. టీడీపీ, జనసేన, బీజేపీ కార్పొరేటర్ల సంఖ్య పెరగడంతో మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలనే ప్రయత్నాలు మొదలయ్యాయి. కానీ ప్రభుత్వం చేసిన చట్ట ప్రకారం వచ్చే మార్చి నెల వరకు మేయర్‌ను కదిపే అవకాశం లేదు. నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయ్యేంత వరకూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టరాదన్న నిబంధన ఉంది. ఈలోపే ఆ కుర్చీపై ఎవరు కూర్చోవాలనే విషయంపై కూటమిలో చర్చోపచర్చలు జరుగుతున్నాయి.

ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల సందర్భంగా నగరంలోని కూటమి కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఎలా గెలవాలన్న అంశంపైనే అందరూ సీరియస్‌గా చర్చిస్తుంటే... ఓ జనసేన కార్పొరేటర్ మాత్రం తన గురి మేయర్ కుర్చీపై ఉందని ఓపెన్ అయిపోవడంతో అంతా నిర్ఘాంతపోయారు. తమ పార్టీకి స్టాండింగ్ కమిటీలో ఒక్క స్థానం కూడా ఇవ్వలేదు.. మేయర్ పీఠం మాత్రం తమకే కావాలనే ప్రతిపాదన ఈ సందర్భంగా ఆయన చేసినట్టు తెలుస్తోంది.

ఇంటికే ప్యాకేజీ..!



సదరు కార్పొరేటర్ మాటలను కూటమి ఎమ్మెల్యేలు, తోటి కార్పొరేటర్లు కొట్టిపారేయగా.. ఆయన మాత్రం ''నేను కాన్ఫిడెంట్‌గానే చెబుతున్నాను.. నాకు మేయర్ పీఠాన్ని ఇవ్వండి.. మీరు ఇప్పటివరకు చూడని రిటర్న్స్ మీకు చూపిస్తాను. ఎవరికీ లోటు రానివ్వను. ఒక్కో ఎమ్మెల్యేకి నెలకు రూ.5 లక్షలు, కార్పొరేటర్లకు నెలకు లక్ష చొప్పున ప్యాకేజీ ఇస్తాను. నెల నెలా జీతం వచ్చినట్లు ఒక ట్రెండు తేదీల్లోగా నేరుగా మీ ఇంటికే డబ్బులు వచ్చేస్తాయి. అందులో ఎలాంటి మొహమాటం లేదు'' అని స్పష్టంగా తేల్చిచెప్పినట్టు సమాచారం. ఎలా వస్తాయని మాత్రం మీరు అడగొద్దు... మీకెవ్వరికీ లోటు రాకుండా చూసుకునే బాధ్యత నాకు వదిలెయ్యండని స్పష్టంగా చెప్పినట్టు తెలుస్తోంది. ఎవరి దగ్గర నుంచి ఎలా లాగెయ్యాలో నాకు తెలిసినంతగా ఇక్కడున్న ఏ సీనియర్ కార్పొరేటర్‌కీ అవగాహన లేదని కూడా కుండబద్దలు కొట్టినట్టు స్పష్టంగా తేల్చిపడేయడంతో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లందరూ విస్తుపోయినట్టు ప్రచారం జరుగుతోంది.

అమ్మో.. ఆయనతో డేంజర్ !



అప్పటి వరకూ అందరి మాటలతో హడావుడిగా ఉన్న సమావేశ మందిరం జనసేన కార్పొరేటర్ ఆఫర్‌తో మూగబోయింది. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు నోరెళ్లబెట్టారు. ఇంత కాన్ఫిడెంట్‌గా అవినీతికి రెడ్ కార్పెట్ పరిచేస్తానని చెబుతున్న కార్పొరేటర్ మాటలతో కొందరు నిశ్చేష్టులవ్వగా.. మరికొందరు గుసగుసలాడుకున్నారు. ఇంకొందరు ఇదేదో ఆఫర్ బాగుంది కదా.. మన చల్ల కదలకుండా నెలకు రూ.లక్షలు రావడమంటే మాటలు కాదంటూ ఆసక్తి కనబరిచారు. ఏదో ఒక విషయం ఆలోచించి చెప్పండంటూ ఆ కార్పొరేటర్ సమావేశం నుంచి బయటకు వెళ్లగానే.. అమ్మో.. ఆడో డేంజర్ క్యాండేట్. ఆయన పేరు ప్రచారంలోకి వస్తే పిచ్చోడి చేతికి రాయిచ్చిన ట్లేనంటూ వ్యాఖ్యానించినట్టు సమాచారం. మొత్తంగా వచ్చే ఏడాదిలో అది కూడా అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గితే వచ్చే మేయర్ పీఠం కోసం టీడీపీ నుంచి మాత్రమే పోటీ ఉంటుందని భావిస్తున్న సందర్భంలో అనూహ్యంగా జనసేన కార్పొరేటర్ తెరమీదకు రావడం మాత్రం కూటమిలో కొత్త చర్చకు తెరలేచిందని చెప్పవచ్చు.

కార్పొరేట్‌కు లాభం.. సామాన్యులకు నష్టం

- కేంద్ర బడ్జెట్‌పై ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజయ్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌శర్మ

అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో మధ్యతరగతి, సామాన్య ప్రజలను దగా చేసి, కార్పొరేట్లకు పెద్దపీట వేసిందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజయ్‌శర్మ ఆరోపించారు. స్థానిక ఎస్‌వీసీ క్లబ్‌లో సోమవారం 'ద్రవ్యోల్బణం-కేంద్ర ప్రభుత్వ బడ్జెట్'అనే అంశంపై క్లబ్ అధ్యక్షుడు జేఎస్ శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకి ఈ బడ్జెట్లో 2.5 శాతం నిధులు తగ్గించారని, మద్దతు ధర, ఇతర అంశాలపై స్పష్టత లేదన్నారు. బీమా చెల్లింపులపై 18 శాతం జీఎస్టీ వేయడం సామాన్య, మధ్యతరగతి ప్రజలను బీమా సౌకర్యానికి దూరం చేయడమేనని ఆక్షేపించారు. ఆరోగ్య బీమాపై జీఎస్టీ విధించడం దుర్మార్గమన్నారు. లగ్జరీ వస్తువులపై జీఎస్టీ తగ్గించి, ఈ ప్రభుత్వం పెద్దల కోసమేనని మరోసారి నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం తదితర సమస్యల పరిష్కారానికి బడ్జెట్లో సరైన కేటాయింపులు లేవన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఈ బడ్జెట్లోనూ కేటాయింపులు లేవని, రాజధాని నిర్మాణానికి వివిధ సంస్థల నుంచి అప్పులు ఇప్పిస్తామని చెప్పడం శోచనీయమన్నారు. పోలవరం, వెనుక బడిన జిల్లాల అభివృద్ధి, రైల్వే జోనుపై ఎలాంటి కేటాయింపుల్లేవని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ గురించి కూడా స్పష్టత లేదన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ కార్యదర్శి ఆడారి శ్రీనివాసరావు, ఎస్‌కే శాస్త్రి, బి.ఉమామహేశ్వరరావు, గంటా శ్రీరామ్, ఆర్.శంకరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి ఝలక్ ఇచ్చిన ఎంపీటీసీలు

- రెండు రోజుల క్రితం పార్టీ మారిన ఎంపీపీ జయలక్ష్మి
- మునగపాక మండల సమావేశాన్ని బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు

8లో

సీబీఎస్‌ఈ ఎత్తివేతకు కూటమి కుట్ర

- సామర్థ్య అంచనాల పేరిట ప్రత్యేక పరీక్షలు
- ట్యాబ్‌లతో సీబీఎస్‌ఈ సిలబస్‌పై నిర్వహణ
- సీబీఎస్‌ఈ రద్దు చేసేందుకేనని అనుమానాలు
- జిల్లాలో 41 స్కూళ్లలో సీబీఎస్‌ఈ సిలబస్

30 రోజుల్లో ఆంగ్ల భాష. 45 రోజుల్లో స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సు. వీటి గురించి తెలియనివారుండరు. ప్రభుత్వ స్కూళ్లలో బోధిస్తోన్న చాలామంది టీచర్లు కూడా వీటిని అనుసరించినవారేనంటే అతిశయోక్తి కాదు. ఐదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులు.. గత వైఎస్సార్ సీపీ పుణ్యమా అని ఆరో తరగతి నుంచి ఆంగ్ల మాధ్యమంలోకి మారి, ఐదేళ్లు చదివాక, సీబీఎస్‌ఈ టెన్త్ పరీక్షలను ఇంగ్లిష్‌లో రాస్తారంటే.. రాయగలరంటే.. మనకు నమ్మకం కుదరదు. ఆంగ్ల మాధ్యమంలో వారి సామర్థ్యాల అంచనా పేరిట, సీబీఎస్‌ఈ ఎత్తివేతకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రకు బడుగు బలహీన వర్గాల పిల్లలే సమిధలు.

నక్కపల్లి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాల విద్య బలోపేతంలో భాగంగా సర్కారీ స్కూళ్ల అభివృద్ధికి చాలా చర్యలు తీసుకుంది. అందులో ఓ భాగమే ఆంగ్లమాధ్యమం, సీబీఎస్‌ఈ సిలబస్ అమలు. 2019–20లో ఆరో తరగతి నుంచి అమల్లోకి తెచ్చిన ఈ విధానంలో ఈ విద్యా సంవత్సరంలో తొలి బ్యాచ్ సీబీఎస్‌ఈ సిలబస్‌తో టెన్త్ పరీక్షలు రాయనుంది. దీంతో వీరి సామర్థ్య అంచనాకు సోమవారం నుంచి ట్యాబ్‌ల సాయంతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో చూపే ప్రతిభ ఆధారంగా వచ్చే మార్చిలో జరిగే టెన్త్ పబ్లిక్ పరీక్షలను ఈ విద్యార్థులు ఆంగ్లమాధ్యమంలో రాయగలరా? లేరా? అని తెలుసుకోనున్నట్లు విద్యాశాఖాధికారులు చెప్పన్నారు. తెలుసుకున్నాక ఏం చేస్తారన్నదానిపై ప్రస్తుతానికి వీరెవరికీ సమాచారం లేదు. అయితే కూటమి ప్రభుత్వం ఓ ప్రణాళిక మేరకు సీబీఎస్‌ఈ విధానానికి చరమగీతం పాడేందుకు ప్రయత్నిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆది నుంచీ అక్కసు

గత ప్రభుత్వం చాలా వరకు అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని తప్పనిసరి చేసింది. దీన్ని అప్పటి ప్రతిపక్షం, ప్రస్తుత అధికార పక్షం టీడీపీ ఆది నుంచీ వ్యతిరేకిస్తూనే వస్తోంది. అయినప్పటికీ జగన్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి ప్రభుత్వ స్కూళ్లను సీబీఎస్‌ఈ స్కూళ్లుగా గుర్తింపు తీసుకొచ్చింది. అనకాపల్లి జిల్లాలో 41 ప్రభుత్వ స్కూళ్లలో సీబీఎస్‌ఈ సిలబస్ అమలవుతోంది. ఇక్కడ చదివే విద్యార్థులు ఈ విద్యాసంవత్సరంలో టెన్త్ పరీక్షలను సీబీఎస్‌ఈలో రాయనున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వీరి సౌకర్యార్థం ద్విభాషా పుస్తకాలను సరఫరా చేసింది. ట్యాబ్‌లను సైతం అందించింది. వీరంతా ఆరో తరగతి నుంచి ఒక్కో తరగతి దాటుకుంటూ ఈ ఏడాది పదో తరగతికి చేరుకున్నారు. నాలుగేళ్లుగా తెలుగు, ఆంగ్ల భాష సమ్మిళితంగా బోధన జరిగింది. పరీక్షలూ అలానే రాశారు. టెన్త్ మాత్రం పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలోనే రాయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో సామర్థ్యాలు సాకుగా చూపుతూ కుట్రలకు తెరలేపారు.



జెడ్పీ హైస్కూల్లో సామర్థ్య పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ట్యాబ్‌లలోనే పరీక్షలు

తాజా సామర్థ్య పరీక్షలను గత ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల ద్వారానే నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలను ట్యాబ్‌లలో అప్‌లోడ్ చేస్తారు. ఈ నెల 12 నుంచి 14 వరకు తర్వాత 17వ తేదీన పరీక్షలు రాయనున్నారు. సీబీఎస్‌ఈలో ఐదు సబ్జెక్టుల విధానం ఉన్నందున ప్రస్తుతం తెలుగు మినహా మిగిలిన సబ్జెక్టులైన ఆంగ్లం, గణితం, సోషల్, సైన్స్ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు పూర్తయిన సిలబస్‌పై ఈ సామర్థ్య అంచనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో మార్కులు ఆధారంగా ఈ విద్యార్థులను సీబీఎస్‌ఈ బోర్డు నిర్వహించే పరీక్షలకు అనుమతించాలా? లేకుంటే స్టేట్ బోర్డు పరీక్షలే నిర్వహించాలా? అన్నది పాఠశాల విద్యాశాఖ నిర్ణయించనుంది.

సీబీఎస్‌ఈ ఎత్తివేసే కుట్ర

సామర్థ్య పరీక్షల నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అనుమానాలు పెరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వానికి సర్కారు పాఠశాలలో సీబీఎస్‌ఈ, ఆంగ్ల మాధ్యమ అమలు ఇష్టం లేదన్నది అందరికీ తెలిసిందే. ఈ విధానం సరికాదని పలు సందర్భాల్లో చంద్రబాబు, లోకేష్‌లతోపాటు పలువురు టీడీపీ, జనసేన నాయకులు విమర్శలు చేశారు. ఈ విధానం సక్సెస్ అయితే ఎక్కడ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, మాజీ సీఎం జగన్‌కు పేరొస్తుందన్న భయం కూటమి నేతల్లో పట్టుకుంది. ఈ భయంతోనే సరైన విధివిధానాలు, నిపుణుల అభిప్రాయాలు తీసుకోకుండా సీబీఎస్‌ఈ అమల్లోకి తెచ్చారంటూ విమర్శలు గుప్పించారు. సామర్థ్యపరీక్షలు నిర్వహించి, సీబీఎస్‌ఈలో పబ్లిక్ పరీక్షలు రాసేంత సామర్థ్యం విద్యార్థులకు లేదనే సాకుతూ ఆయా పాఠశాలల్లో సీబీఎస్‌ఈ రద్దుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

జిల్లాలో సీబీఎస్‌ఈ స్కూళ్లు

ఏపీ మోడల్ స్కూళ్లు	5
ఏపీఆర్‌ఈఐ స్కూళ్లు	1
ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ స్కూళ్లు	7
బీసీ వెల్ఫేర్ స్కూళ్లు	1
కేజీబీవీలు	20
ఎంపీపీ/జెడ్పీ స్కూళ్లు	6
రాష్ట్ర ప్రభుత్వ స్కూళ్లు	1

ఎమ్మెల్సీ స్థానానికి బొత్స నామినేషన్



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో అరకు ఎంపీ తనూజరాణి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ

- మరో స్వతంత్ర అభ్యర్థి కూడా దాఖలు

మహారాణిపేట (విశాఖ): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. మధ్యాహ్నం 1.45 గంటలకు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కలెక్టరేట్‌కు చేరుకొని ఆర్వో కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌కు మూడు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. బొత్స వెంట ఆయన సతీమణి బొత్స ఝాన్సీ, అరకు ఎంపీ తనూజరాణి, మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, నగర మేయర్ హరి వెంకటకుమారి ఉన్నారు. నామినేషన్ దాఖలు చేసిన వెంటనే సంప్రదాయం ప్రకారం బొత్స సత్యనారాయణ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, కె.కన్నబాబు, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు రవిరెడ్డి, ఈర్లె అనురాధ, డాక్టర్ జహీర్ అహ్మద్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సుంకరి గిరిబాబు, డిప్యూటీ మేయర్ కె.సతీష్, తదితరులు పాల్గొన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా షేక్ షఫీ ఉల్లా నామినేషన్ దాఖలు చేశారు. ఒక సెట్ పత్రాలను ఆర్వోకు అందజేశారు.

ఆస్తి రూ.21.32 కోట్లు.. అప్పు రూ.2.87 కోట్లు

బొత్స సత్యనారాయణ సార్వత్రిక ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో ప్రస్తావించిన ఆస్తులతో పోలిస్తే రూ.73 లక్షల మేర పెరగ్గా.. అప్పులు రూ.95 లక్షలు పెరిగాయి. అప్పుడు రూ.1.92 కోట్ల అప్పులు ఉన్నట్టు వెల్లడించగా తాజాగా సమర్పించిన అఫిడవిట్‌లో రూ.2.87 కోట్లు అప్పులు ఉన్నట్టు పేర్కొన్నారు. తనతోపాటు తన భార్య ఆస్తులు కలిపి మొత్తం రూ.21.32 కోట్లు ఉన్నట్లు తెలిపారు.

వాచ్‌మన్ విధులపై వీఆర్‌ఏల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శనలో గ్రామ రెవెన్యూ సహాయకులు

తుమ్మపాల: ప్రభుత్వ కార్యాలయాల్లో వాచ్‌మన్ డ్యూటీల నుంచి తమను మినహాయించాలంటూ కలెక్టరేట్ వద్ద గ్రామ రెవెన్యూ సహాయకులు నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల వీఆర్‌ఏలు సోమవారం నిరసన తెలిపి, డీఆర్వో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. వాచ్‌మన్ డ్యూటీల వల్ల ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికిపోతున్నామని వాపోయారు. తమ విధులకు అదనంగా వాచ్‌మెన్ డ్యూటీలను కేటాయించడం అన్యాయమన్నారు. కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న వాచ్‌మన్, అటెండర్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులను వీఆర్‌ఏల సినియారిటీ ఆధారంగా భర్తీ చేయాలన్నారు. నామినీగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని, పే స్కేల్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. అర్హత గల వారికి వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు.

స్వాతంత్య్ర స్ఫూర్తి.. ఉప్పొంగిన దేశభక్తి

స్వాతంత్య్ర దినోత్సవం సమీపిస్తుండడంతో మువ్వన్నెల రెపరెపలు కనువిందు చేస్తున్నాయి. దేశభక్తిని పెంపొందింపజేస్తున్నాయి. ఉమా హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో సోమవారం తిరంగ జెండా ఊరేగింపు ఉత్సవం ఉత్సాహభరితంగా జరిగింది. సుమారు 600 అడుగుల పొడవైన జాతీయ జెండా చేతబూని బయ్యవరం నుంచి తేగాడ వద్ద ఉన్న మోడల్ స్కూల్ వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సీఐ ఎం.వినోద్‌బాబు బయ్యవరంలో ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఊరేగింపు అనంతరం మోడల్ స్కూల్‌లో జెండా ఆవిష్కరించారు. అమర జవాన్లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమా హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు పి.ఉమాశంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

\- కశింకోట



600 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

అందమైన రంగవల్లులై...

దేవరాపల్లిలో రంగు రంగుల సీతాకోక చిలుకలు కనువిందు చేశాయి. దేవరాపల్లికి చెందిన మొల్లి ఎర్రినాయుడు పొలంలో సీతాకోక చిలుకలు వివిధ రకాల పూలపై మకరందాన్ని ఆస్వాదిస్తూ అబ్బుర పరిచాయి. ప్రకృతి ప్రేమికుల మనసు దోచేల సందడి చేశాయి. ఆహ్లాదకరంగా వాతావరణాన్ని స్థానికులు ఆస్వాదించారు. మకరందాన్ని ఆస్వాదిస్తూ సందడి చేసిన సీతాకోక చిలుకలను సాక్షి తన కెమెరాలో క్లిక్ మనిపించింది. - దేవరాపల్లి


మందార పువ్వుపై మకరందాన్ని ఆస్వాదిస్తూ..


వివిధ రకాల పూలపై సందడి చేస్తూ...


పసుపు రంగులో అబ్బురపరుస్తూ...


ఎండిన ఆకు కాదు.. సీతాకోక చిలుక


ఒకే ఆకుపై మనసు దోచేలా..


పచ్చని ఆకులపై పరవశం

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

- సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్‌ఖాన్


ర్యాలీలో సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్‌ఖాన్, ఆర్డీవో, అధికారులు

నర్సీపట్నం : మాదక ద్రవ్యాల బారినపడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్‌ఖాన్ పేర్కొన్నారు. లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులులు, పోలీసు, కోర్టు సిబ్బందితో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ స్టేడియం నుంచి ఆర్టీసీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి కుటుంబాలకు అండగా నిలవాల్సిన యువత మాదక ద్రవ్యాలకు బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తులో ఎంతటి నేరాలైనా చేయడానికి వెనుకాడరన్నారు. మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రభుత్వం నార్కోటిక్స్, డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ సబ్‌స్టెన్సెస్ చట్టం చేసిందన్నారు. బానిసలైన వారిని డ్రగ్ డీఅడిక్షన్ కేంద్రాలను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. ఆర్డీవో హెచ్.వి.జయరాం మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, ఎంఈవో నాగేంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మెట్టా ప్రభాకర్, అనిమిరెడ్డి శివకృష్ణ, సీఐ హరి, ఎస్ఐలు సుధాకర్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌కు రా...రమ్మని!

- టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్
- రెగ్యులర్ కోర్సులతో సమానంగా గుర్తింపు
- ఈ నెల 28 వరకు ప్రవేశాలకు గడువు
- జిల్లాలో 32 స్టడీ సెంటర్లు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ) దూరవిద్య విధానం ద్వారా పది, ఇంటర్ కోర్సులను ఏటా నిర్వహిస్తోంది. 2024-25 విద్యాసంవత్సరానికి ఓపెన్ స్కూల్లో పది, ఇంటర్ అడ్మిషన్లకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో 32 స్టడీ సెంటర్లు ఉన్నాయి.


యలమంచిలిలో ఓపెన్ స్కూల్ స్టడీ కేంద్రంగా ఉన్న కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల


అనకాపల్లి జీవీఎంసీ ప్రధాన పాఠశాలలో ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల సమన్వయకర్తలకు సూచనలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ (ఫైల్)

యలమంచిలి రూరల్ : చదువుకోవాలని ఉన్నప్పటికీ కుటుంబ పరిస్థితులు, పేదరికం కారణంగా అనేక మంది విద్యార్థులు చదువుకు దూరమవుతుంటారు. ఈ క్రమంలో బడి మధ్యలో మానేసిన యువత, వయోజనులకు చదువుకునే అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానం తీసుకువచ్చింది. ఓపెన్ స్కూల్ ఇచ్చే సర్టిఫికెట్లకు రెగ్యులర్ కోర్సులతో సమానంగా ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. పది పరీక్షలు రాసేవారు నిర్ణీత ఐదేళ్లలో గరిష్ఠంగా తొమ్మిది సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్ పరీక్షలు రాసేవారు పదో తరగతి పాసై రెండేళ్లు వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులూ ఒకేసారి రాసుకునే అవకాశం ఉంటుంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక్క సబ్జెక్టూ రాసుకోవచ్చు. అడ్మిషన్ పొందిన అనంతరం ఐదేళ్లలో తొమ్మిది సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కాకపోతే తిరిగి కొత్తగా అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులయ్యాక డిగ్రీ, పీజీ తదితర కోర్సులతో పాటు పోటీ పరీక్షల్లో ప్రతిభను చాటుకునే అవకాశం వీలుంది. ఎంసెట్, డిఈఈ సెట్‌తో పాటు ఇంటర్ అర్హతతో అన్ని ఉద్యోగాలకు అర్హులవుతారు.

ప్రవేశాలకు దరఖాస్తులు

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని స్టడీ సెంటర్ల ద్వారా ప్రవేశాలు పొందిన వారంతా చదువుకోవచ్చు. ప్రవేశం పొందేందుకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రవేశం తీసుకోవడానికి ఎలాంటి వయో పరిమితి లేదు. ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో జిల్లా విద్యాశాఖ అడ్మిషన్ల పెంపుపై దృష్టి సారించింది. ఈ నెల 3న అనకాపల్లిలో ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల కో-ఆర్డినేటర్లు, ఎంఈవోలతో జిల్లాస్థాయి సన్నద్ధతా సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య పెంచడానికి విస్తృతంగా ప్రచారం చేయాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ, యలమంచిలి ఉపవిద్యాశాఖాధికారి అప్పారావు,జిల్లా ఓపెన్ స్కూళ్ల కో ఆర్డినేటర్ కుమార్‌లు సూచించారు. అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి మండల స్థాయిలో ఎంఈవోలు కీలకంగా వ్యవహరించాలని చెప్పారు.



ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ వెబ్‌సైట్

ప్రవేశాలు ఇలా..

జూలై 31వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 28వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అడ్మిషన్ పొందవచ్చు. రూ.200 అపరాధ రుసుంతో ఈ నెల 29వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు అడ్మిషన్ పొందవచ్చు.పదో తరగతికి సంబంధించి జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్,అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1550, అన్ని వర్గాల మహిళలు,ఎస్సీ,ఎస్టీ,బీసీ ,మైనార్టీ, పీహెచ్‌సీ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు రెండూ కలిపి రూ.1150 చెల్లించాల్సి ఉంది. ఇంటర్‌కు సంబంధించి జనరల్ పురుషులకు రూ.1800, అన్ని వర్గాల మహిళలు,బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ.1500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

అడ్మిషన్ల ప్రారంభ తేదీ 31.07.2024
అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించడానికి గడువు : 28.08.2024
రూ.200 అపరాధ రుసుంతో ఫీజు చెల్లింపునకు గడువు : 04.09.2024

గత రెండేళ్లలో అడ్మిషన్ల వివరాలు

సంవత్సరం	టెన్త్	ఇంటర్
2022-23	657	1660
2023-24	722	1848

ఇవీ సబ్జెక్టులు..

పదో తరగతికి గ్రూపు-ఏ లో ఇంగ్లిషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు-బీలో గణితం,సైన్స్,సోషల్ తీసుకోవాలి.ఇంటర్‌కు గ్రూపు-ఏ లో ఇంగ్లీషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు-బీలో ప్రధాన సబ్జెక్టుల్లో మూడింటితో కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రవేశం పొందిన తర్వాత స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు. ఓపెన్ స్కూల్లో ప్రవేశం తీసుకున్న వారికి ప్రతి ఆదివారం, ప్రతి నెలా రెండో శనివారం ఆయా అధ్యయన కేంద్రాల్లో 30 కాంటాక్టు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 24 కాంటాక్టు తరగతులకు హాజరైన వారిని మాత్రమే మార్చి/ఏప్రిల్ నెలల్లో నిర్వహించే వార్షిక పరీక్షలకు అనుమతిస్తారు.

రెగ్యులర్ విద్యార్థులకూ అవకాశం

రెగ్యులర్‌గా స్కూళ్లు, కాలేజీల్లో పదో తరగతి, ఇంటర్ చదివి ఉత్తీర్ణులు కాలేకపోతున్న వారు కూడా ఓపెన్ స్కూల్లో చేరి సులభంగా ఉండే సబ్జెక్టులు ఎంపిక చేసుకుని పాసయ్యే అవకాశం ఉంది. రెగ్యులర్ పది, ఇంటర్ కోర్సులు చదివి ఫెయిలైనప్పటి నుంచి ఐదేళ్లలోపు ఓపెన్ స్కూల్లో చేరితే రెగ్యులర్‌గా పాసైన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండు సబ్జెక్టుల మార్కులు బదలాయించుకునే అవకాశం కూడా వీలుంటుంది. పదిలో హిందీ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలు రాస్తే సరిపోతుంది.

అర్హతలు ఇవే..

10వ తరగతిలో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాలు వయసు నిండి ఉండాలి. గరిష్ట వయో పరిమితి ఉండదు. చదవడం,రాయడం తెలిసి ఉండాలి.దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీటు, పుట్టిన తేదీ ధృవపత్రం, ఇంటర్‌లో చేరడానికి 10వ తరగతి మార్కుల జాబితా, ఎస్ఎస్‌సీ టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి. ఎస్సీ,ఎస్టీ,బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం,దివ్యాంగులు వైకల్య ధృవీకరణ పత్రం జతచేయాల్సి ఉంటుంది.ఇతర సమాచారం కోసం www.apopenrchoo.ap.gov.in వెబ్‌సైట్‌ను చూడాలి.

సార్వత్రిక విద్య వరం..



చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ విద్య ఓ వరం. ఈ ఏడాది పదో తరగతి,ఇంటర్‌లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి. అడ్మిషన్ల పెంపునకు అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ రూపొందించాం. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి జారీ చేసే సర్టిఫికెట్లు, రెగ్యులర్ విద్యార్థులకిచ్చే సర్టిఫికెట్లతో సమానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు ఉంటుంది.

-ఓ.కుమార్, ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్

రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి



ఈ ఏడాది ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. నెలాఖరు వరకు గడువు ఉంది. ఇంటర్నెట్ సెంటర్లు, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తుల నమోదు చేసుకోవాలి. అభ్యర్థులు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలు ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా చదువుకునే వారికి రెగ్యులర్ టెన్త్, ఇంటర్ మాదిరిగానే అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలకూ గుర్తింపు ఉంటుంది. అన్ని మండలాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అడ్మిషన్‌లు చేయించేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కాకుండా ఎక్కువగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

-ఎం.వెంకటలక్ష్మమ్మ, జిల్లా విద్యాశాఖాధికారిణి

నా భర్తది హత్యే?

- ఆ కోణంలో దర్యాప్తు చేసి నిందితులను శిక్షించాలి
- దేవరాపల్లి పోలీసులకు మృతుడి భార్య ఫిర్యాదు


దేవరాపల్లి ఇన్‌చార్జి ఎస్ఐకు ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న మృతుడి భార్య అల్లు దుర్గలక్ష్మి

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లికి చెందిన తన భర్త అల్లు అప్పారావుది హత్యేనని, ఆ కోణంలో సమగ్ర విచారణ చేపట్టి, తమ కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి భార్య దుర్గలక్ష్మి పోలీసులను కోరింది. ఈ మేరకు గ్రామస్తులతో కలిసి ఇన్‌చార్జి ఎస్ఐ జి.నారాయణరావుకు సోమవారం ఆమె లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఈ నెల 5న గ్రామానికి చెందిన బెల్లం క్రషర్ మెకానిక్ అప్పారావు(39) మారేపల్లి-తెనుగుపూడి రోడ్డులోని చెరకు తోటలో అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. తన భర్తతో అతి సన్నిహితంగా ఉన్న వ్యక్తే ఈ హత్య చేసి ఉంటాడని మృతుడి భార్య అనుమానం వ్యక్తం చేసింది. సదరు వ్యక్తి తమ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులతో మాట్లాడిన తీరు అనుమానాలకు బలం చేకూర్చుతోంది. పోలీసులు ప్రత్యేక చొరవ చూపి తన భర్త మృతిపై విచారణ వేగవంతం చేసి వాస్తవాలను వెలికి తీయాలని, తనకు, తన పిల్లలకు పెద్ద దిక్కు లేకుండా చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరింది. అప్పారావుది ముమ్మాటికీ హత్యేనని, సమగ్ర విచారణ చేపట్టి నిందితులను శిక్షించకుంటే బాధిత కుటుంబానికి మద్దతుగా ఆందోళన చేస్తామని గ్రామస్తులు ముక్త కంఠంతో స్పష్టం చేశారు. దీనిపై ఇన్‌చార్జి ఎస్ఐను వివరణ కోరగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నివేదిక వచ్చాక, దాని ఆధారంగా విచారణ చేపడతామన్నారు. మృతుడి భార్యకు మద్దతుగా వచ్చిన వారిలో అవుగడ్డ కోటిపల్లినాయుడు, కిల్లి గోవింద, అల్లు రామారావు, ఈర్లె స్వామినాయుడు తదితరులు ఉన్నారు.

బాలికల వసతి గృహం నిర్వాహకులపై చర్యలు

చోడవరం రూరల్: పట్టణ శివారు అన్నవరంలోని బీసీ బాలికల వసతి గృహంలో వసతుల లేమిపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలకు సుమోటోగా కేసు స్వీకరిస్తున్నట్టు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వసతి గృహ నిర్వాహకులపై ఇప్పటికే పలు ఆరోపణలు ఉన్నాయన్నారు. హాస్టల్ విద్యార్థినులపై సిబ్బంది వేధింపులు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించకుండా బాలల హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటితోపాటు హాస్టల్ నిర్వహణ పట్ల వసతి గృహాల నిర్వహణాధికారులు తగు విచారణ జరిపి ఆ నివేదికను తమకు అందించాలని సూచించారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోకపోతే ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చట్టాన్ని అనుసరించి ప్రభుత్వానికి తమ సిఫారసులు అందిస్తామని హెచ్చరించారు.

నాటక రంగానికి జీవం పోస్తున్న మునగపాక

- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మునగపాక : మునగపాక గ్రామం నాటకరంగానికి జీవం పోస్తుందని ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మునగపాక గ్రామీణ యువజన మందిరం 60 వసంతోత్సవాల సందర్భంగా ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోనే మునగపాకకు నాటక రంగానికి పెట్టింది పేరుగా అభివర్ణించారు. గత 60 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా కళాకారులను ప్రోత్సహిస్తున్న యువజన మందిరం సేవలు అభినందనీయమన్నారు. మునగపాకలో ఎప్పుడు నాటక పరిషత్ ఏర్పాటు చేసినా ప్రేక్షకుల మధ్య నుంచి తిలకించే అనుభవం తనకుందన్నారు. కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ఆగస్టు 15 వరకు మునగపాకలో నిర్వహించే నాటికలను విజయవంతం చేయాలని అయ్యన్నపాత్రుడు కోరారు.

ఎంపీపీకి ఝలక్ ఇచ్చిన ఎంపీటీసీలు

- రెండు రోజుల క్రితం పార్టీ మారిన ఎంపీపీ జయలక్ష్మి
- మండల సమావేశాన్ని బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు
- కోరం లేక సమావేశం వాయిదా


సభ్యులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

మునగపాక : మునగపాక ఎంపీపీ మళ్ల జయలక్ష్మికి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు సోమవారం ఝలక్ ఇచ్చారు. దీంతో సర్వసభ్య సమావేశం వాయిదాకు దారి తీసింది. తనకు ఎంపీపీగా అవకాశం కల్పించిన పార్టీని కాదని వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీ మారిన ఆమెకు ప్రతిపక్ష పార్టీ ఎంపీటీసీలు గుణపాఠం చెప్పారు. ఏం చేయాలో తెలియక ఆమె సమావేశాన్ని వాయిదా వేయాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని 16 ఎంపీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అన్ని స్థానాలను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో మునగపాకకు చెందిన ఎంపీటీసీ-1 మళ్ల జయలక్ష్మిని ఎంపీపీగా ఇతర సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే రెండేళ్ల క్రితం మెలిపాక ఎంపీటీసీ సూరిశెట్టి వెంకటరావు మృతి చెందారు. అలాగే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు నాగవరం ఎంపీటీసీ పాలిపిని శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలో చేరారు. వారం రోజుల క్రితం నాగులాపల్లికి చెందిన వైస్ ఎంపీపీ చిందాడ దేవి, రెండు రోజుల క్రితం మునగపాక ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, చెర్లోపాలెం వైస్ ఎంపీపీ బోజా లక్ష్మిలు కూడా జనసేనలో చేరారు. దీంతో జనసేన బలం నాలుగుకు చేరింది. మిగిలిన 11 స్థానాల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు ఎంపీటీసీలుగా కొనసాగుతున్నారు. కాగా వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన ఎంపీపీ జయలక్ష్మి కనీసం పార్టీ పెద్దలకు సమాచారం ఇవ్వకుండా జనసేనలో చేరడంపై ఆగ్రహించిన వైఎస్సార్‌సీపీ సభ్యులు ఆమెకు గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకున్నారు. సోమవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వేదికగా చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 11 మంది సమావేశాన్ని బహిష్కరించారు. 15 మంది సభ్యులున్న మండల పరిషత్‌కు కనీసం ఏడుగురు సభ్యులుంటేనే సమావేశం నిర్వహించాలి. కోరం ఉండాలంటే ఈ నిబంధన తప్పనిసరి.

సమావేశానికి ఐదుగురు సభ్యులు మాత్రమే హాజరుకావడంతో చేసేది లేక ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధికారుల ద్వారా సమావేశాన్ని వాయిదా వేయించారు. వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు కూడా మద్దతు తెలుపుతూ సమావేశాన్ని బహిష్కరించడం అధికార పార్టీ ఎంపీటీసీలకు మింగుడు పడలేదు. ఇదిలా ఉండగా మండల సర్వసభ్య సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ హాజరవుతారని తొలుత భావించారు. అయితే సమావేశానికి అవసరమయ్యే కోరం లేదని తెలుసుకొని ఆయన మిన్నకుండిపోయారు.

కిక్ బాక్సింగ్ విజేతలకు ఆర్డీవో అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం : ఏపీ స్టేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో ఈ నెల 11న రాజమండ్రిలో నిర్వహించిన కిక్ బాక్సింగ్ పోటీల్లో నర్సీపట్నం ఆర్‌పీ మార్షల్ ఆర్ట్స్ అకాడమి నుంచి పాల్గొన్న క్రీడాకారులు పతకాలు సాధించారు. ఎస్.హైనైతి, జి.పూజ్య హన్విత, ఎస్.పూజిత, ఎ.మనోజ్‌కుమార్, ఆర్.హేమంత్ స్వర్ణ పతకం సాధించారు. ఎస్.తనుష్‌చంద్ర, ఎస్.యోషిత, ఎం.నీహాష్, ఆర్.మోక్షిత్ రజత పతకం, ఎస్.శివలింగేశ్వరరావు, సిహెచ్.ప్రశాంత్, జి.హేమ ప్రసన్న కాంస్య పతకాలు సాధించారు. వారితో పాటు వారికి శిక్షణ ఇచ్చిన కోచ్ చిన్నను ఆర్డీవో హెచ్.విజయరాం, అకాడమి చైర్మన్ వెలగా నారాయణరావు అభినందించారు. జాతీయస్థాయిలో రాణించి నర్సీపట్నానికి మంచి పేరు తీసుకురావాలని ఆర్డీవో ఆకాంక్షించారు.

జనసేన నాయకుడిపై హోం మంత్రికి ఫిర్యాదు

- పంచాయతీ కార్యదర్శిపై కావాలనే దుష్ప్రచారం
- విచారణ చేయాలని రాజయ్యపేట పాలకవర్గం అభ్యర్థన


తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న జనసేన నాయకుడిపై హోం మంత్రికి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేటకు చెందిన జనసేన పార్టీ గ్రామ శాఖ అతధ్యక్షుడు పిక్కి స్వామి పంచాయతీ కార్యదర్శిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ గ్రామాభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నాడని సర్పంచ్ పిక్కి అప్పలనర్స, టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు పిక్కి ముసలయ్య, వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ ఆగ్రహించారు. జనసేన నాయకుడు వైఖరి వల్ల గ్రామంలో పనిచేసేందుకు అధికారులు భయపడుతున్నారని వాపోయారు. ఈ మేరకు సోమవారం హోం మంత్రి వంగలపూడి అనితకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పిక్కి స్వామి కొద్ది రోజులుగా పంచాయతీ కార్యదర్శి పి.వి. రాజశేఖర్‌ను టార్గెట్ చేశాడు. పంచాయతీ సమావేశాలు సక్రమంగా నిర్వహించడం లేదని, పాలకవర్గం అనుమతి లేకుండా నిధులు డ్రా చేసి పనులు చేయకుండా దుర్వినియోగం చేస్తున్నాడని కలెక్టర్, డీపీవో, ఈవోపీఆర్డీలకు ఫిర్యాదు చేశాడు. తన అనుచరులైన జనసేన కార్యకర్తలతో కలసి సర్పంచ్, ఆమె కుమారుడు, పంచాయతీ కార్యదర్శులపై దౌర్జన్యానికి పాల్పడి గతే డాది గ్రామ సభ నిర్వాహణకు విఘాతం కలిగించాడు. ఈ ఘటనలో సర్పంచ్‌కు, కార్యదర్శికి గాయాలయ్యాయి. అప్పట్లో పిక్కి స్వామిపై పోలీసు కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో గ్రామాభివృద్ధితోపాటు పూరీ, కోణార్క్, తదితర ప్రాంతాలకు ఉపాధి కోసం తాత్కాలిక వలస వెళ్లిన వారికి సైతం పింఛన్లు బట్వాడా చేస్తూ కార్యదర్శి రాజశేఖర్ మన్ననలు పొందుతున్నారు. అతడిపై కక్ష కట్టి తరచూ తప్పుడు ఆరోపణలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీనివల్ల గ్రామంలో పనిచేసేందుకు అధికారులు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. గ్రామ కార్యదర్శి వల్ల గ్రామస్తులకు పంచాయతీ పాలకవర్గానికి ఎటువంటి ఇబ్బంది లేదు. ఆయన ఎటువంటి నిధులు దుర్వినియోగానికి పాల్పడలేదని హోం మంత్రికి రాత పూర్వకంగా ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. పిక్కి స్వామి తప్పుడు ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కోరారు.

పాడి 'ఎద'గాలి.. పల్లె మురవాలి

- పశు సంరక్షణతోనే.. పల్లెప్రగతి
- గేదెలు, ఆవుల్లో ఎద లక్షణాలపై అప్రమత్తం
- 'మూగ ఎద'పై రైతులకు అవగాహన అవసరం

గ్రామాల్లో రైతుల జీవనాధారం పాడి, పంట. వర్షాకాలం వచ్చేసింది. ఖరీఫ్ సీజన్ ముమ్మరంగా నడుస్తోంది. ఇదే సమయంలో పశు సంపదపైనా రైతులు శ్రద్ధపెట్టాలి. పునరుత్పత్తికి వచ్చే ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భధారణ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎద సమయం కొన్ని గంటలు మాత్రమే. దీంతో ఆ కాస్త వ్యవధిలోనే ఆడ పశువులను జాగ్రత్తగా గమనించుకుని, గర్భధారణ ఇంజక్షన్లు వేయించాలని పశు వైద్య నిపుణులు చెప్తున్నారు.

అనకాపల్లి : నేల తల్లిని, పశు సంపదను నమ్ముకుని జీవించే రైతులకు తీరికలేని సమయం ఇది. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఈ సీజన్లో యుక్త వయస్సుకు వచ్చిన ఆడపశువులు అండాశయంలో ఉత్పత్తి అయిన హార్మోన్ల ప్రభావంతో 20 నుంచి 21 రోజులు 'ఎద'లక్షణాలు వ్యక్తం చేస్తాయి. రైతులు దీన్ని గుర్తించి సకాలంలో కృత్రిమ గర్భధారణ చేయించడం పునరుత్పత్తి యాజమాన్యంలో అత్యంత కీలకం. పాడి రైతులు ఎదను సరిగా గుర్తించకపోతే ఎంతో నష్టపోతారు. ఒక ఎద తగ్గినా, వాటి పునరుత్పత్తి పీరియడ్‌లో నెలల వరకు తగ్గిపోతుంది. పశువుల ఎద కాలాన్ని సూచించే లక్షణాలను పాడిరైతు తెలుసుకోవాలి. సాధారణంగా గేదెలు సెప్టెంబరు నుంచి మార్చి వరకు, ఆవులు ఏడాది పొడవునా ఎదకు వస్తాయి. యుక్త వయస్సులో ఉన్న పశువుల అండాశయంలో హార్మోన్ల ప్రభావం(తీగలు వేయడం) వల్ల ఎద లక్షణాలు గుర్తిస్తారు.

గేదెల్లో ఎద లక్షణాలు

గేదెల్లో అవి జన్మించిన రెండున్నరేళ్ల నుంచి మూడేళ్లలోపు ఎద లక్షణాలు వస్తాయి. తరచూ చిరు మూత్రం పోసే గేదెలు ఎదలో ఉన్నట్లు గుర్తించాలి. గేదెల్లో ఎద లక్షణాలు 24 నుంచి 36 గంటల పాటు ఉంటాయి. ఆ సమయంలో గేదెలు చికాగ్గా ఉంటూ మేత తినడం మానేస్తాయి. మానం తెరిచి చూస్తే లోపల ఉబ్బి పొర ఎర్రగా ఉంటుంది. పాడి గేదెలు ఎదకు వచ్చినప్పుడు పాల దిగుబడి తగ్గుతుంది.


వెంకుపాలెంలో గేదెకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్ చేస్తున్న వైద్య సిబ్బంది


గవరపాలెంలో ఆవుకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

మండలంలో పశు సంపద

గేదెలు	ఆవులు
13,000	8,000

మేలు జాతి రకం	ధర రూ. వేలల్లో	పాల దిగుబడి లీటర్లలో
గేది	60-80	8-10
ఆవు	40-60	12-16

ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే గేదెలకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్ 24 గంటల్లోపు ఇవ్వాలి.

ఆవుల్లో ఎద లక్షణాలు

ఆవులు జన్మించిన ఒకటిన్నర ఏడాది(18 నెలలు) తర్వాత ఎద లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు 18 నుంచి 24 గంటల పాటు ఉంటాయి. సాధారణంగా ఎద కాలాన్ని మూడు దశలుగా విభజిస్తారు. ఎదకు వచ్చిన ఆవులు తొలిదశలో మంద నుంచి వేరుపడి చికాగ్గా ఉంటాయి. ఆకలి మందగించడం వలన మేత సరిగా తినవు. ఉదయం పూట ఎద లక్షణాలు గుర్తించినట్లయితే 12 గంటల తర్వాత కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్ ఇవ్వాలి. మానం ఉబ్బి ఉంటుంది. తరుచూ మూత్ర విసర్జన చేస్తాయి.

'మూగ ఎద'పై అప్రమత్తం

గేదెల్లో అప్పడప్పుడు ఎద లక్షణాలు స్పష్టంగా కనిపించవు. దానినే మూగ ఎద లక్షణాలు అంటారు. అలాంటి పశువులను రైతులు గుర్తించి, సకాలంలో వైద్యం అందిస్తే ఎద లక్షణాలు కనిపిస్తాయి. ఎద మొదలైన 12 గంటల తర్వాత గర్భధారణ చేయించాలి. అంటే ఉదయం ఎదకు వస్తే సాయంత్రం, సాయంత్రం ఎదకు వస్తే మరుసటి రోజు ఉదయం చేయించాలి. గర్భధారణ చేసిన తర్వాత రోజంతా పశువును ఇంట్లోనే కట్టివేయాలి.

గర్భధారణ ఇంజక్షన్లు చేయించాలి



ఎదకు వచ్చే గేదెలు, ఆవులను సకాంలో రైతులు గుర్తించి కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేయించాలి. మూగ ఎద లక్షణాలపై అవగాహన తప్పనిసరి. పశు సంరక్షణలో భాగంగా పశువులకు ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తాం. 4 నుంచి 8 నెలల ఆడపెయ్యలకు బ్రూసెల్లోసిస్ నివారణ టీకాలు వేయడం పరిపాటి. ఈ వ్యాధి పశు సంపదను నిర్వీర్యం చేయడంతోపాటు, మనుషులకూ ప్రాణాంతకమే. అందుకే రైతులు అప్రమత్తంగా ఉండాలి.

– సీహెచ్ అనిల్‌కుమార్, పశు వైద్యశాఖ అధికారి, గవరపాలెం

క్లుప్తంగా

ల్యాబ్‌లు లేని ఐటీఐలపై చర్యలు తీసుకోవాలి


ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ

అనకాపల్లి: జిల్లాలో ఐటీఐ విద్యార్థులు ప్రాక్టికల్స్ చేసేందుకు ల్యాబ్ వసతిలేని కళాశాలలకు ప్రభుత్వం అనుమతులివ్వడం హాస్యాస్పందంగా ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ ఆక్షేపించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీఐ విద్యార్థులు కళాశాలల్లో చదువుకునే సమయంలో వివిధ రకాలైన ట్రేడ్లలో ప్రాక్టికల్స్ చేసేందుకు అవసరమైన పరికరాలతో ఆయా సంస్థలు ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో 12 ప్రైవేట్ ఐటీఐలు కనీస ల్యాబ్ సౌకర్యాలు లేకుండా నడుస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి వాటికి ప్రభుత్వం అనుమతులివ్వడం దారుణమన్నారు. వీటిపై చర్యలు తీసుకుని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు వెంకటేష్, అర్జున్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయిలు ప్రారంభం


ఇంటింటి కుళాయి పథకాన్ని ప్రారంభిస్తున్న పసుపులేటి లక్ష్మి

అనకాపల్లి: గ్రామాల్లో పరిశుభ్రమైన తాగునీరు ఇంటింటికి అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు శంకరం గ్రామ సర్పంచ్ పసుపులేటి లక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రమైన తాగునీటిని సేవించడం ద్వారా చాలా రోగాల బారి నుంచి రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గుడాల తాతబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.రామకృష్ణ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై సోమవారం కేసు నమోదయింది. పట్టణ హెచ్‌సీ ఎస్.రామకృష్ణ తెలిపిన వివరాలు. పట్టణంలోని రహదారుల్లో వాహన తనిఖీలు చేస్తుండగా, కొంకోట మండలం వెదురుపర్తి గ్రామానికి చెందిన ఎ.సన్యాసినాయుడు అనుమానాస్పందంగా కనిపించాడు. అతడిని తనిఖీ చేయగా 8 క్వార్టర్ బాటిళ్ల మద్యం పట్టుబడింది. మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 120 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,200	4,900
రెండో రకం	3,810	4,180
మూడోరకం	3,190	3,300

అనకాపల్లి సినిమాలు

పాగల్ v/s కాదల్	: రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
సంఘర్షణ	: రాజా(మ్యాట్నీ, సెకండ్‌షో)
కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
తిరగబడరస్వామి	: వెంకటేశ్వర
సూపర్ డీలక్స్	: శ్రీసత్య
భవనమ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 70 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-42 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 368 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు


గుండాల జంక్షన్ బీసీ మహిళ వసతి గృహంవద్ద ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దిన వేడుకలు

అనకాపల్లి: దేశంలో తొలి విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఏర్పాటై 88 ఏళ్లు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందని సంఘ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర అన్నారు. స్థానిక గుండాల జంక్షన్ బీసీ మహిళా వసతి గృహం వద్ద ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యమే ధ్యేయంగా 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని బెనారస్ విశ్వవిద్యాలయంలో ఏర్పడిన ఏఐఎస్ఎఫ్, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా విద్యార్థుల్ని ఐక్యం చేస్తూ అలుపెరుగని ఉద్యమాలు చేసిందన్నారు. 88 ఏళ్ల పూర్తి చేసుకుని 89వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా సీనియర్ నాయకుడు దొరబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై భవిష్యత్ కార్యాచరణను వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల సమస్యల పరిష్కారానికి, జిల్లా కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పోరాటం చేయనున్నట్లు వెల్లడించారు. విద్య ప్రైవేటీకరణకు, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సింహాద్రి, రంజిత, కృష్ణవేణి, వెంకట్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి


రక్తదానం చేస్తున్న ఫార్మాసిటీ ఉద్యోగులు

పరవాడ: రక్తదానం చేయడానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఫార్మాసిటీమేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లాల్‌కృష్ణ పిలుపునిచ్చారు. రాంకీ ఫౌండేషన్ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ సౌజన్యంతో ఫార్మాసిటీ పరిపాలన భవనంలో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా ఈ శిబిరాన్ని లాల్‌కృష్ణ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో అవసరమైన మేరకు రక్తం లభించడం లేదన్నారు. వెనకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలైన విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో గర్భిణులకు ప్రసవం సమయంలో అవసరమైన రక్తం అందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమస్యను అధిగమించాలంటే ప్రతి పౌరుడు ఏడాదికి మూడు పర్యాయాలు రక్తదానం చేయడానికి ముందుకు రావలసిన అవసరం ఉందన్నారు. ఈ శిబిరంలో 150 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. రక్తదాతలకు డాక్టర్ లాల్‌కృష్ణ సర్టిఫికెట్లను అందజేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ కె.శ్రీనివాసరావు, ఫార్మాసిటీ డీజీఎం గరధర్‌భక్షి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ కె.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

జీవో 117 రద్దు తర్వాతే పని సర్దుబాటు

- ఫ్యాప్టో చైర్మన్ గొంది చినబ్బాయ్


డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో చైర్మన్ గొంది చినబ్బాయ్

అనకాపల్లి: జీవో నంబర్ 117ను రద్దు చేసిన తర్వాతే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గొంది చినబ్బాయ్ తెలిపారు. జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మకు సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. జీవో కారణంగా యూపీ స్కూళ్లు, ఎలిమెంటరీ స్కూళ్లలో ఉపాధ్యాయులు లేక పూర్తిగా నష్టపోయాయని, హైస్కూళ్లలో టీచర్ పీపుల్ రేషియోని అత్యధికంగా చూపించి ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించేశారని, ప్రభుత్వం ఈ వర్కర్ డిస్ట్రెంటు విషయంలో ఉపాధ్యాయ సంఘాలు ఇచ్చిన సూచనలను పట్టించుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం అన్యాయమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి వై. సుధాకర్ (ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం), కోశాధికారి పరదేశి (ఎస్టీయూ), డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రవీంద్రబాబు (హెచ్ఎం అసోసియేషన్), ధర్మారావు (ఏపీటీఎఫ్), వి శ్రీలక్ష్మి (యూటీఎఫ్) తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ



తూటిపాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాకవరపాలెం: మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ సోమవారం తూటిపాలలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నాషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. హెచ్ఎం రాము, పంచాయతీ కార్యదర్శి బాబూరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

అనకాపల్లి: విశాఖ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గొలుగొండ మండలం కృష్ణదేవిపేటకు చెందిన గల్లా చిన్నరాజు(52) సోమవారం మృతి చెందినట్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపిన వివరాలివి. ఈనెల 5న మండలంలో మామిడిపాలెం జంక్షన్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో గల్లా చిన్నరాజు తలకు తీవ్ర గాయం కావడంతో అప్పటి నుంచి విశాఖలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

16 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

యలమంచిలి రూరల్ : భూములకు సంబంధించిన ఫిర్యాదులు,అంశాలను పరిష్కరించేందుకు ఈ నెల 16 నుంచి యలమంచిలి పట్టణం, మండలంలో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్. రాణీ అమ్మాజీ సోమవారం విలేకరులకు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రామాల్లో సదస్సులు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించినట్లు ఆమె తెలిపారు. 16న కొక్కిరాపల్లి,17న తురంగలపాలెం, 19న జంపపాలెం, 20న సోమలింగపాలెం, 21న గొల్లగుంట, 22న కట్టుపాలెం, 23న తెరువుపల్లి, 24న యర్రవరం, 27న రేగుపాలెం, 28న కృష్ణాపురం, 29న పులపర్తి, 30న బయ్యవరం, 31న పీఎస్ ఆర్‌పేట, సెప్టెంబరు 2న ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో ఏటికొప్పాక సెప్టెంబరు 3న ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో యలమంచిలి పట్టణంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సదస్సుల్లో గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడానికి అధికారులు నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోనున్నారు. భూ కబ్జాలు, 22ఏ దుర్వినియోగం వంటి సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు వినతి పత్రాలు ఇవ్వవచ్చు. ఫిర్యాదుల స్వీకరణకు భూముల వ్యవహారాలతో సంబంధమున్న అటవీ, దేవదాయ, వక్ఫ్ తదితర శాఖల అధికారులు సదస్సులకు హాజరవుతారని తహసీల్దార్ తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌పై నేడు సదస్సు

అచ్యుతాపురం : మండలంలోని అచ్యుత కళాశాలలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు కేంద్ర బడ్జెట్‌పై సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ, ఉపాధ్యాయ స్టడీ సర్కిల్ ప్రతినిధి మారిశెట్టి వెంకటరావు సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని ప్రధాన అంశాలపై సెమినార్‌లో మేధావి వర్గాలకు చెందిన వారు, ఇతర ప్రతినిధులు పాల్గొని చర్చించవచ్చని, వారి అభిప్రాయాలను తెలియపరచవచ్చని ఆయన పేర్కొన్నారు.

'పంట కాలువల్లో పూడిక తొలగించాలి'


పట్టణంలోని చెర్లోపలి కాలువను పరిశీలిస్తున్న సీపీఎం సభ్యులు

అనకాపల్లి: పట్టణ పరిధిలో ఉన్న పంటకాలువల్లో పూడికతీత పనులు తక్షణమే చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. స్థానిక చెర్లోపలి కాలువను సీపీఎం నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుంచి పట్టణం మీదుగా ఆవఖండం పొలాల్లోకి ప్రవహించే సాగునీటి కాలువలు చెత్తాచెదారాలతో పూడుకుపోయినట్లు తెలిపారు. దీంతో పంటపొలాలకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు డ్రైనేజీ నీరు కూడా బయటకు పోయే మార్గం లేక, ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దోమలు పెరిగి, ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రుత్తల శంకరరావు, కాళ్ల తేలయ్యబాబు, బొప్పే ఉమా మహేశ్వరరావు పి.చలపతి తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంపై అవగాహన



వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పరవాడ: జీవ వైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన అవసరమని జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.ఖగేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అనకాపల్లి ఆధ్వర్యంలో వక్తృత్వ షార్ట్ ఫిలిం పోటీలు, జీవ వైవిధ్యంపై యువత పాత్ర అనే అంశంపై వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో సోమవారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు హాజరై ప్రతిభ కనబరిచారు. విజేతలకు స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామని పాఠశాల హెచ్ఎం పి.కనకేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ బి.అన్నాజీరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ

అచ్యుతాపురం: స్థానిక సమీకృత పిల్లల పాఠశాల విద్యార్థులకు నెలకు సరిపడా రేషన్ సరుకుల్ని రాంకీ ఫౌండేషన్ సోమవారం అందించింది. రాంకీ 18వ వార్షికోత్సవం సందర్భంగా విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ భక్షి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్, పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం... రైతులకు శాపం


ఉమ్మలాడలో సాగునీటి కాలువ గుండా మురుగునీటి ప్రవాహం

- అధ్వానంగా సాగునీటి కాలువలు
- ఖరీఫ్‌కు తప్పని కష్టాలు


మునగపాక బీసీ కాలనీని ఆనుకుని తూటికాడతో దర్శనమిస్తున్న సాగునీటి కాలువ

మునగపాక : మునగపాక మండలంలో ఎక్కువ మందికి వ్యవసాయమే జీవనాధారం. అయితే సాగునీటి కాలువల పరిస్థితి రైతులకు కష్టాలు తెచ్చి పెడుతున్నాయి. కాలువల్లో సాగునీటి ప్రవాహం సక్రమంగా జరగకపోవడంతో రైతులు వ్యవసాయం అంటేనే పెదవి విరుస్తున్నారు. సీజన్‌లో పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వానికి నివేదికలు అందజేయడం తప్ప రైతాంగానికి మేలు చేకూర్చడంలో అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సాగునీటి కాలువలే ఆధారం...

పంటల సాగుకు సాగునీటి కాలువలే ఆధారంగా నిలవాల్సి ఉంది. ప్రతి ఏటా సాగునీటి కాలువలు, చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టని కారణంగా పంటలకు నీరందని పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా చెరకు, వరితో పాటు అపరాల సాగుపై దృష్టి సారిస్తుంటారు రైతులు. మెజార్టీ రైతులకు సాగునీటి కాలువల ద్వారా వచ్చే నీరే ఆధారం. అయితే పంట పొలాలకు అందించే సాగునీటి విషయంలో అధికారుల నిర్లక్ష్య ధోరణే అన్న ఆరోపణలు ఉన్నాయి. మునగపాకలోని కృష్ణంరాజు కాలువ, తోటాడ ఆవ కాలువ, గణపర్తి–చూచుకొండ వద్ద రోలుగెడ్డ, మునగపాకలోని శీలప్పన చెరువు అలాగే చెరువు కాలువ, బీసీ కాలనీని ఆనుకొని కాలువ తదితర సాగునీటి వనరుల ఆధారంగా పంటలు పండిస్తుంటారు. అయితే ఎగువ నుంచి వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించే అవకాశం లేకపోతుంది.

స్వరూపం కోల్పోతున్న సాగునీటి వనరులు

పలు చోట్ల కాలువలు స్వరూపం కోల్పోతున్నాయి. ఉమ్మలాడ వద్ద సాగునీటి కాలువల గుండా మురుగు నీరు ప్రవహిస్తుంది. పలు ప్రాంతాల్లో చెరువులు, గెడ్డల్లో తూటుగడ్డి పెరిగిపోతుంది. దీంతో ఎగువ నుంచి నీటి ప్రవాహానికి అంతరాయం కలుగుతుంది. ఫలితంగా పంట పొలాలకు సాగునీరు అందే పరిస్థితులు లేవు. మండల వ్యాప్తంగా 4674 హెక్టార్లకు పైగా పంటల సాగు జరుగుతుంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఎగువ నుంచి వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

ఏళ్ల తరబడి సాగునీటి కాలువల అభివృద్ధికి అధికారులు ప్రభుత్వాలకు నివేదికలు పంపుతూనే ఉన్నారు. అంతేకాని క్షేత్రస్థాయిలో రైతుకు ఒరిగిందేమీ లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేవలం సాగునీటి కాలువల ఆధారంగా పంటలు సాగించే రైతులు మాత్రం సాగునీటి రంగం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి సాగునీటి రంగంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

చిన్నారులకు ఆటల పోటీలు


మ్యూజికల్ చైర్ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

అచ్యుతాపురం : మండలంలోని మోసయ్యపేటలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని పిల్లలకు లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్ వంటి పలు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మి మాట్లాడుతూ చిన్నారుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తి కలిగించేందుకు ప్రతి ఏటా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధూళి సిరి, ధూళి పావని, విఘ్నేశ్వరి, అరుణ్ పాల్గొన్నారు.